# కన్నీటి కెరటాల వెన్నెల

ఓల్గా

స్వేచ్ఛ ప్రచురణలు
హైదరాబాద్

ఇంకొకతను లేచి -

"రావు సాహెబ్‌కి రాధమీద ప్రేమ, కోరిక వున్నాయి. సరే... రాధ కెందుకుండాలి? భర్త వున్నప్పుడుకూడా రావుసాహెబ్ గురించి ఆసక్తి చూపుతుందెందుకు? రావ్‌సాహెబ్ జేబురుమాలు పడిపోతే దానినీ, దానినుంచి వస్తున్న సెంటు వాసననూ వదల్లేనట్టు ఎందుకు ఫీలవుతుంది? అది అసహజం కాదా? పెళ్ళయి భర్తతో కాపురంచేసుకుంటున్న స్త్రీ ఏదో ఒక లెవల్లో పరపురుషుడంటే ఆసక్తి చూపినట్లు ఎందుకు చిత్రించారు?" అనడిగాడు.

ఆమె నవ్వుతూ సమాధానం ఇచ్చింది -

"స్త్రీ పురుషులు ఒకోసారి మిగిలిన పరిస్థితుల, పరిసరాల ప్రభావం ఏమీలేకుం డానే కేవలం మానవ శరీరంలో జరిగే రసాయనిక చర్యలకారణంగానే ఆకర్షితులవటం జరుగుతుంది. కేవలం కెమిస్ట్రీ ఆఫ్‌ది హ్యూమన్ బాడీ అది. అది చూపించాను నేను. నిజంగా ఐలవ్‌దట్ కెమిస్ట్రీ" అని చల్లగా మధురంగా నవ్వింది.

ఆమె ధైర్యానికి ఆమెకున్న స్పష్టతకీ, ఆమె ఒక విషయాన్ని నవ్వుతూ నవ్వుతూ వివరించే తీరుకీ క్లాసంతా ముగ్ధులైపోయారు. రేణు ఆమెను గాఢంగా ప్రేమించింది.

ఆమె క్లాసయ్యాక సూర్యంతో ఆ మాటే చెప్పింది. సూర్యం తానంతకన్నా ఎక్కువగానే ప్రేమిస్తున్నానని చెప్పాడు. ఆమె మాటల్ని మళ్ళీమళ్ళీ చెప్పుకున్నారు.

"ఆ కెమిస్ట్రీ గురించి ఆవిడ అంత చక్కగా, ధైర్యంగా చెప్పటం ఎంత బాగుంది. ఒక స్త్రీ ఆ విషయాన్ని అలాచెప్పాలంటే మనిషిగా ఎంతో ఎదిగి వుండాలి. చాలా ఇన్‌హిబిషన్స్ పోగొట్టుకోవాలి. కొడవటిగంటి కుటుంబరావుగారు "కురూపి" నవలలో చాలాసార్లు చెబుతారు – ఈవిడ మాటలు వింటుంటే నాకు ఆ "కురూపి" గుర్తొచ్చింది"

"బహుశ రజనీ – సంజయ్‌ల విషయంకూడా అంతేనేమో?" అంది రేణు.

"రజనీ – సంజయ్‌ల విషయం ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు సూర్యం.

రేణు నాలుకకొరుక్కుంది. గమనతో మాట్లాడాల్సిన మాటలు సూర్యంతో మాట్లాడినందుకు నెత్తిమీద చేత్తోకొట్టుకుంది. ఆ తర్వాత మాట్లాడకుండా కూర్చున్న రేణును చూసి సూర్యం

"నటన బాగానే కుదిరిందిగానీ డైలాగ్స్ మర్చిపోయారు" అన్నాడు సీరియస్‌గా.

రేణు నవ్వి వూరుకుంది.

"ఎంత అన్యాయం. నేను అన్ని సంగతులూ మీతో చెబుతాను. మీకేమో నా దగ్గర రహస్యాలున్నాయి"

"రహస్యంకాదు – అదేదో ఆడవాళ్ళ గొడవ పోనిద్దురూ" తీసెయ్యబోయింది.

"మీకిష్టం లేకపోతే చెప్పొద్దుగాని – ఆడవాళ్ళ గొడవ, మగవాళ్ళ గొడవ అని రెండుంటాయన్నట్లు మాట్లాడి నాకు కోపంతెప్పించకండి"

"అబ్బ – ఏం లేదండీ.... రజనీ సంజయ్‌ల మధ్య ఎఫైర్ జరుగుతోంది – దాన్ని గురించి అన్నాను. ఆ విషయం వినగానే నాకు రజనీ మీద కోపం వచ్చింది, చీదరనిపించింది. నేను చీదరించుకున్నట్లు మాట్లాడితే గమన విమర్శించింది. విజయ మెహతా మాటలు వింటుంటే వాళ్ళిద్దరిమధ్యా ఆకర్షణ కలిగిందేమో, ఆ కెమిస్ట్రీ ప్రభావమేమో అనిపించింది. అసలీగోలంతా నాకెందుకు? ఇంక అసలు ఆలోచించను" తలవిదిలించుకుంది రేణు.

"ఆలోచిస్తే ఏమవుతుంది? ఆలోచనలకు భయపడటం దేనికి?"

"ఏమో – ఇలాంటి విషయాల గురించి ఆలోచించాలంటేనే భయంగా వుంటుంది" అంది నీరసంగా.

"ఆ భయం వున్నంతకాలం ఈ విషయాల గురించి మీకు అజ్ఞానం, అస్పష్టత వుంటూనే వుంటుంది. ఆలోచించటానికే భయపడుతున్నారంటే సమాజం స్త్రీ పురుష సంబంధాల విషయాన్ని, ఎంత నిషేధవస్తువుగా వుంచిందో అర్థమవుతోంది" రేణు కాసేపు మాట్లాడకుండా కూర్చుంది. చివరకు తన సంకోచాన్ని వదిలి సందేహాలను తీర్చుకుందామని నిశ్చయించుకున్నట్లుగా అడిగింది –

"రజని ఈ నాలుగు రోజులకోసం సంజయ్ గురించి ఏమీతెలియకుండా సంబంధంపెట్టుకోవటం మంచిదేనా?"

"మంచి అంటే – ఎవరికి మంచి?"

"అందరికీ – రజనికీ, మనకీ – సమాజానికి" వివరించింది రేణు.

"అంటే రజనీ చేసినపని రజనీ ఒక్కదానికేగాక మనందరికీ, సమాజానికీ సంబంధించిన విషయం అంటున్నారా?"

"కాదా మరి? అందరూ రజనీలాగా వుంటే–?" ఈ విషయం తెలియదా అన్నట్టు అడిగింది.

"ఉంటే–?" రెట్టించాడు సూర్యం.

"సమాజం ఏమవుతుంది? పతనమైపోదూ?" ఈ విషయలో సందేహమేమిటన్నట్టు అడిగింది.

"సమాజం సంగతలావుంచండి. రజనీ – సంజయ్‌ల సంబంధవల్ల ఆమె చుట్టుపక్కలవున్న మనకేం నష్టమో ముందది చెప్పండి?"

"మనకేం నష్టం లేదు" ఆలోచనగా చెప్పింది.

"మరి ఇక్కడ జరిగిన ఒక సంఘటనవల్ల ఇక్కడున్న మనకే లేనినష్టం సమాజానికంతటికీ ఏముంటుంది?"

"సంజయ్ భార్యకిది తెలిస్తే ఆమె ఎంత బాధపడుతుంది" ఇక దీనికి తిరుగు లేదన్నట్టు చెప్పింది రేణు.

"ఆమెకు అభ్యంతరం లేదనుకోండి – అప్పుడు?"

"బాగానే వుంది. ఆమెకే లేనిబాధ మనకెందుకు?" విసుక్కుంది.

"చూశారా - ముందు సమాజానికంతా సంబంధంవుందన్నారు. తర్వాత సంజయ్ భార్యకి బాధలేకపోతే మనకేం బాధ అన్నారు. అంటే ఇది సంజయ్ - రజనీల వ్యక్తిగత సమస్య అన్నమాట"

"కావచ్చు.... ఇలా చాలామంది రజనీలూ - సంజయ్‌లూ తయారైతే సమాజానికి సమస్య అవుతుందా లేదా?" రేణు తనకు సరియైన పాయింటు ఇప్పుడు దొరికిందన్న ఉత్సాహంతో అడిగింది.

"సమాజంలో చాలామంది రజనీలూ - సంజయ్‌లూ ఎందుకు తయారవుతార నేది మనం ఆలోచించాలి.... ఆలోచిద్దాం. ముందు సమాజంలో ప్రస్తుతం చాలామంది రజనీలూ - సంజయ్‌లూ లేరనుకుందాం. ఎందుకు లేరు? ఆలోచించి చెప్పండి-" విద్యార్థిని కఠినమైన ప్రశ్న అడిగి సంతోషించే గురువుగారిలా సూర్యం సంతోషంగా సిగరెట్ వెలిగించి తీరిగ్గా కూచున్నాడు.

"ఎందుకు లేరంటే - అవినీతిపనులు చెయ్యటం అందరికీ ఇష్టంవుండదు"

"అవినీతి అంటే ఏమిటి?" చిద్విలాసంగా అడుగుతున్న సూర్యాన్ని చూస్తుంటే రేణుకు ఒళ్ళుమండిపోయింది.

"అవినీతి అంటే - అవినీతి అంటే - చెడ్డపనులు చెయ్యటం" అంటూ తడబడు తున్న రేణును చూసి నవ్వాడు సూర్యం.

"నీతి - అవినీతుల గురించి మంచి నిర్వచనం నేను చెప్పనా?"

"చెప్పండి"

"అది నా నిర్వచనం కాదు - కుటుంబరావు గారు చెప్పింది. మనిషి నుంచి మనిషికి సాధ్యమైనంత తక్కువ అపకారమూ, సాధ్యమైనంత ఎక్కువ ఉపకారమూ జరిగేలా చూసుకోవటమే నీతి - దాన్నిబట్టి అవినీతి అంటే ఏమిటో కూడా తెలుస్తుంది కదా -"

"అంటే ఎవరికీ అపకారం జరగకపోతే అది అవినీతి కాదా?" సూర్యం చెప్పిన విషయాన్ని నమ్మలేనట్టు అడిగింది.

"ఎలా అవుతుందో చెప్పండి?"

"అంటే రజనీ చేసిన పనిని మీరు సమర్థిస్తున్నారా?"

"సమర్థించను"

"మరి ఏం చేస్తారు.... ఖండించనైతే ఖండించరుగా"

"మీకీభాష ఎక్కడనుంచీ వచ్చిందండీ- అయినా సమర్థించటం, ఖండించటం ఈ రెండేనా మనం చెయ్యగలిగిన పనులు?"

"మరేం చెయ్యాలి...చెప్పండి.... ఏం చెయ్యాలో" రేణుకు అసహనం పెరిగిపోతోంది.

"అర్థంచేసుకోవటానికి ప్రయత్నించాలి"

"అదే - ఎలా అర్థంచేసుకోవాలో తెలియకే ఈ బాధంతా. మాధవిని అర్థంచేసుకోవచ్చు గానీ రజనీనెలా అర్థంచేసుకోవాలో తెలవకే బుర్రబద్దలు కొట్టుకుంటున్నా"

"బుర్రబద్దలు కొట్టుకుంటే ఏమీలాభంలేదు. బుర్రని ఉపయోగించి ఆలోచించండి. మీరు పరిణామవాదాన్ని ఒప్పుకుంటారా. జంతుదశనుంచి మానవుడు పరిణామం చెందాడని-"

ఒప్పుకుంటానన్నట్టు తలవూపింది.

"జంతువులు కలవటానికి వాటికి ప్రేమా, స్నేహం, అవగాహన అక్కర్లేదు. వాటికి అర్థం జంతువులకు తెలియదు. తెలియనందుకు మనం వాటిని తప్పుపట్టలేం. మనిషి మనిషిగా పరిణామం చెందుతున్న క్రమంలో ప్రేమా, స్నేహం వీటి గురించి తెలుసుకున్నాడు. ఈ గుణాలని అభివృద్ధిచేసుకున్నాడు. వీటి గురించి జ్ఞానం సంపాదిస్తున్నాడు. మొదట కళ్ళకు కనబడే అందాన్నే ప్రేమించగలిగేవాడు. తర్వాత వాళ్ళలో గుణాన్ని ప్రేమించగలిగాడు. ఇప్పుడు అందం, గుణం కాకుండా తన భావాలవంటి భావాలు వున్నవాళ్ళను ప్రేమించటం అభివృద్ధి అని తెలుసుకుంటున్నాడు"

"ఈ అభివృద్ధిని అర్థంచేసుకోలేని కొందరు ఇంకా జంతుదశలోనే వుంటారనుకో - ఏం చెయ్యాలి?"

"వాళ్ళకు ఉన్నతమైన ప్రేమ తెలియటంలేదని జాలిపడాలి. తెలుసుకునే అవకాశం ఉండీ తెలుసుకోనందుకు కోపం తెచ్చుకోవచ్చు. కానీ అది అవినీతి అనుకోవటం, పాపం అనుకోవటం, వాళ్ళను అసహ్యించుకోవటం - ఇదంతా నాన్సెన్స్ కదూ -"

రేణు సూర్యం మాటలని లోతుగా అర్థంచేసుకోటానికి ప్రయత్నిస్తున్నట్లు ఆలోచిస్తూ మౌనంగా వుంది. "స్త్రీ, పురుషుల మధ్య కలిగే ఆకర్షణబట్టి కెమిస్ట్రీ – నిజమే. కానీ ఆ కెమిస్ట్రీని అర్థంచేసుకుని, ఆ కెమిస్ట్రీతోనే తృప్తిపడకుండా దానిని మించి మానవులుగా మనం సాధించిన విలువలకోసం వెదకటం మంచిది.

అలా వెతకలేకపోతే అది అవినీతి అని అసహ్యించుకోవటం కాదు మనం చెయ్యాల్సింది.

ప్రేమ స్నేహాల విలువ మనుషులందరికీ అర్థం కావాలి. అది సులభం కాదు... చాలా కష్టం. వాటిని అర్థంచేసుకోవాలి – అర్థం చేయించాలి. ఆ విలువలు అర్థంకాకా, అర్థమైనా అవి దొరకకా మనుషులిలా ప్రవర్తిస్తుంటారు.

రజనికే నిజమైన ప్రేమ దొరికివుంటే ఇలా ప్రవర్తించేదికాదని నా కనిపిస్తోంది.

కనీసం ప్రేమ విలువ తెలిసినా ఆ ప్రేమ కోసం వెతికేది. ఆ రెండూ తెలియని అమ్మాయి తనకిష్టమైనట్లు తను వుంటోంది. దానివల్ల వచ్చే కష్టనష్టాలు ఆమే భరిస్తుంది.

నిజానికి సమాజంలో నూటికి తొంభైమంది ప్రేమ తెలియకుండానే దానికోసం ఆరాటపడకుండానే, వెతకకుండానే బతుకుతున్నారు. వాళ్ళలో కొందరు తమకే తెలియని అశాంతితో రజనీలా ప్రవర్తిస్తే అది మానవులందరి తప్పు అవుతుంది"

"మాధవి విషయంలో నాకు సమాజం తప్పు స్పష్టంగా తెలిసింది" అంటూ రేణు మాధవి విషయం కూడా సూర్యంతో చెప్పింది.